

విద్యాకమిటీల ఎన్నికలపై నిరాశ

- నాలుగేళ్లకు నోటిఫికేషన్.. అంతలోనే బ్రేక్
- ఇప్పటికే పాత ఎస్‌ఎంసీల రద్దు
- స్కూల్ గ్రాంట్స్ వినియోగంపై అయోమయం
- పార్లమెంట్ ఎన్నికల తర్వాతే నిర్వహణ
- జిల్లాలో 534 పాఠశాలలు, 49,766 మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

విద్యాకమిటీల ఎన్నికలపై మళ్లీ నిరాశే ఎదురైంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యా కమిటీలకు కొత్త ప్రభుత్వంలో మోక్షం లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు భావించారు. నాలుగేళ్ల తర్వాత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణకు ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యంతరాల స్వీకరణ, విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలు సిద్ధం చేశారు. సోమవారం ఎస్‌ఎంసీ కొత్త కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రభుత్వం ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో ఎన్నుకున్న విద్యా కమిటీల కాలపరిమితి రెండేళ్లకు ముగిసినా ఆ తర్వాత 6 నెలల చొప్పున కమిటీల కాలాన్ని పొడగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే పాత కమిటీలను రద్దు చేసి కొత్తవాటి కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్నికలు వాయిదా పడడంతో విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయులు, సమయ పాలన పాటించకపోయినా వచ్చిన స్కూల్ గ్రాంట్ నిధులు వినియోగం, పాఠశాలలు జరిగే పనులను పర్యవేక్షించే వారు. 'మన ఊరు-మన బడి'కి సంబంధించిన నిధులు కూడా విద్యా కమిటీ ఖాతాల్లో జమ చేస్తారు. నిధుల వినియోగంలో కూడా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి జాయింట్ అకౌంట్ ఇచ్చారు. ఎస్‌ఎంసీల స్థానంలో ఎవరిని నియమిస్తారనేది తేల్చాల్సి ఉంది. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్నారు.

● లోక్‌సభ ఎన్నికల తర్వాతే మోక్షమా?

జిల్లాలో ఇప్పటి వరకు బీఆర్‌ఎస్‌కు చెందిన వారే కమిటీల్లో ఉన్నారు. పాఠశాల పరిధిలోని కింది స్థాయి నాయకులు విద్యా కమిటీల్లో ఉండవచ్చని భావించారు. ఎన్నికలు రద్దు కావడంతో సందడికి బ్రేక్ పడింది. ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం ఉంటుందని భావించినట్లుగా తెలుస్తోంది. ఇదే కారణమైతే ఎస్‌ఎంసీ ఎన్నికలు వచ్చే విద్యా సంవత్సరంలోనే జరిగే అవకాశం ఉంది.

● జిల్లాలో పాఠశాలలు, విద్యార్థులు

జిల్లాలో 510 సాధారణ పాఠశాలలు, ఏడు మోడల్ స్కూల్‌లు, 13 కస్తూర్బా, అర్బన్ రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 49,766 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 1 నుంచి 8వ తరగతికి సంబంధించిన విద్యార్థులు 36,247 మంది ఉన్నారు. ఈ విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రులకే విద్యా కమిటీల్లో పోటీ చేసే అవకాశం, ఎన్నుకునే అవకాశం ఉంటుంది. విద్యా కమిటీల్లో ఆ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా స్థానిక సంస్థల నుంచి ఎన్నుకుంటారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూడా ఉంటారు. కమిటీ సభ్యుల్లో నాలుగు భాగాల్లో మూడో వంతు మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉండాలి. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున పిల్లల తల్లిదండ్రులను కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఇందులో జనరల్ కేటగిరీలో ఒకరు, ఎస్సీ ఎస్టీల నుంచి ఒకరు, బీసీ మైనార్టీ నుంచి ఒకరు ఉంటారు. ఎన్నుకునే సభ్యుల్లో ఇద్దరు మహిళలు ఉంటారు. ఎన్నుకునే సమయంలో 50 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాల్సి ఉంటుంది. ఎన్నుకున్న కమిటీ పాఠశాలల పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన పథకం, అల్పాహారం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు, ఉత్తీర్ణత శాతం పెంచే సూచనలు వంటివి చేస్తూ కీలకంగా పని చేస్తారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

వేములవాడ, జనవరి 29: రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, మహా శివరాత్రి జాతర ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం అదనపు కలెక్టర్ ఆలయ, రెవెన్యూ మున్సిపల్ అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలని, దర్శనం త్వరితగతిన లభించే విధంగా చూడాలని ఆదేశించారు. క్యూలైన్లలో, వసతి గదులలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. ఆర్‌డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఏఈవో జయకుమారి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ ఈ రఘునందన్, ఏఈ రామ్‌కిషన్‌రావు, ఆలయ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

వేములవాడ, జనవరి 29: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఒక్కరికి విద్యార్థి జీవితం అత్యంత ముఖ్యమైనదని, సమయాన్ని వృథా చేయకుండా అధ్యాపకులు చెప్పింది శ్రద్ధగా విని పాటించాలన్నారు. మనిషి జీవితంలో చక్కటి మార్గాన్ని ఎన్నుకోవడానికి ఇంటర్మీడియట్ దశ కీలకమైనదని, ఈ సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే జీవితంలో స్థిరపడతామన్నారు. చాలా మంది సెల్‌ఫోన్ లో నిమగ్నమై తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుం టు న్నారని, అలా చేయకుండా సమయాన్ని బాగా చదువుకొని బంగారు భవిష్యత్ కోసం ఉపయోగించు కోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జనవరి 29 : బాధితు లకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనలకు అనుగుణంగా బాధితులకు న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారన్నారు.

దశలవారీగా నియోజకవర్గ అభివృద్ధి

వేములవాడ టౌన్, జనవరి 29: వేములవాడ నియోజకవర్గాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మారుపాకలో సోమవారం పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకరవ్గంలో ప్రజలకు కావాల్సిన ప్రతీ అవసరాన్ని గుర్తించి పరిష్కరించే దిశగా ముందుకు కదులుతున్నట్లు చెప్పారు. ముఖ్యమైన పనులను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే వేములవాడ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. పల్లె దవాఖానా ద్వారా పేదలకు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధిని కొనసాగిస్తోందని అన్నారు. మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నానన్నారు. బ్రిడ్జి నిర్మాణాలతోపాటు రైతులకు ఉపయోగపడే వరి కల్లాలను త్వరలో నిర్మించుకుందామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని తప్పకుండా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామన్నారు. బస్సుల సంఖ్యను పెంచాలని రవాణా శాఖను మంత్రి కోరగా తొమ్మిది బస్సులను మంజూరు చేశారన్నారు. త్వరలోనే మిగతా హామీలను అమలు పరిచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ, మాజీ సర్పంచ్ ముడికే చంద్రశేఖర్ యాదవ్ తదితరులు ఉన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నేడు మంత్రి పొన్నం పర్యటన

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ముస్తాబాద్‌లో జడ్పీటీసీతోపాటు పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గంభీరావుపేట మండలం కోళ్ల మద్ది గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం, గంభీరావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్‌లను, మధ్యాహ్నం 1.20 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో రైతు వేదిక భవనాన్ని ప్రారంభించనున్నారు. దుమాలలో జిల్లా పరిషత్ పాఠశాల కంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రైతు వేదిక భవనాన్ని ప్రారంభిస్తారు. 2.15 గంటలకు ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు పార్టీలో చేరనున్నారు. రాగట్లపల్లిలో ఆర్వీఎస్ గదులను ప్రారంభించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 6.30 గంటలకు సిరిసిల్ల లహరీ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించానున్నరు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీర్నపల్లి, జనవరి 29 : వీర్నపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మాలోతు భూల అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో మండల సర్పంచుల సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక నిధులతో గ్రామాల అభివృద్ధి

వీర్నపల్లి, జనవరి 29 : ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో మారుమూల గ్రామాల కోసం ప్రత్యేకంగా జడ్పీ నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా అన్నారు. వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా, అడవి పదిర ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద జడ్పీ నిధుల ద్వారా రూ.2 లక్షలతో రెండు బోరు మోటార్లను, కేజీబీవీ పాఠశాల వద్ద రూ.లక్షతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంత్రి కేటీఆర్ మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ బోయిని రవి, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి నీలిమ, నాయకులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

తంగళ్లపల్లి, జనవరి 29: తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో బోర్ మోటారు, మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. స్థానిక ఎంపీటీసీ నిధుల నుంచి బోరు మోటారు, మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బైరినేని రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుర్మాణి లింగారెడ్డి, నాయకులు వైద్య శివ ప్రసాద్, జల్లం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న సర్పంచ్ శ్రీధర్‌పంతులు

గంభీరావుపేట, జనవరి 29: గంభీరావుపేటలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రబాకర్‌గౌడ్ సమక్షంలో పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ముచ్చర్ల ఉప సర్పంచ్ రాఘవేందర్‌రెడి, మాజీ ఎంపీటీసీ ఆవునూరి లక్ష్మయ్య కూడా కాంగ్రెలో చేరనున్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఉమెన్ హబ్ జిల్లా కో-ఆర్డినేటర్ రోజా

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: జీవితంలో యవ్వన దశ కీలకమని, విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని ఉమెన్ హబ్ జిల్లా కో- ఆర్డినేటర్ రోజా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమెన్ హబ్, సఖీ, బాల రక్షాభవన్ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. సెల్‌ఫోన్లు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థినులు వివరాలను ఇవ్వవద్దన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవలని, గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. పోకిరీలు వేధిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఇన్ చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సఖీ కేంద్రం ఇన్‌చార్జి దీపిక, బాలరక్షా భవన్ అధికారి గౌతమి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి పర్శరాములు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు

వేములవాడ రూరల్, జనవరి 29: మండలంలోని ఫాజుల్‌గర్ నుంచి తుర్కాశి నగర్ వెళ్లే రహదారికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో సోమవారం అధికారులు తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన క్రమంలో ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు చేపట్టామని త్వరలోనే 3 కిలోమీటర్లు తారు రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు రంగు వెంకటేశం తెలిపారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ సంకల్పం

ఇల్లంతకుంట, జనవరి 29: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ సంకల్పమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేసన్నపల్లె, జవారిపేట గ్రామాల్లో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందినప్పుడే పేదరికం తగ్గుముఖం పడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే రెండింటిని అమలు చేశామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గతంలో కొంతమంది నాయకులు చేసిన ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని, పట్టణాలతో పోటీపడేలా చేస్తామని అన్నారు. జవారిపేట, కేసన్నపల్లె గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, సర్పంచులు పోతరాజు ఎల్లవ్వనర్సయ్య, అన్నాడి కరుణ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఉపసర్పంచులు చిట్యాల రాజయ్య, ఏల భూపతి, నాయకులు పాశం రాజేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎలుక స్వామి, పోతరాజు పర్శరాం, అంతగిరి బాలపోచయ్య ఒగ్గు రమేష్, మల్లేశం, ఎర్రోజు సంతోష్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

గ్రామపంచాయతీల పాలకవర్గాలను ఎమ్మెల్యే సత్యనారాయణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పదివికాలం ముగియనున్నా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచుల సమస్యలు పరిష్కరించని నాయకులు నేడు చేస్తున్న ప్రకటనలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు.

అవిశ్వాసం పుకార్లను నమ్మవద్దు

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో అవిశ్వాసమని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని, అలాంటి పుకార్లను నమ్మవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతోపాటు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం సిరిసిల్లలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు అవిశ్వాసంపై వచ్చిన వార్తలను ఖండించారు. బీఆర్‌ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశానికి ఆరుగురు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదన్నారు. బీఆర్‌ఎస్‌పై బురద జల్లేందుకు కొందరు స్వార్థపరులు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో అవిశ్వాసం అంటూ పుకార్లు సృష్టించారన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మార్గదర్శకాల ప్రకారం తమంతా ఐక్యంగా ఉన్నామన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం సిరిసిల్లకు కేటాయించిన దాదాపు రూ.40 కోట్ల నిధులకు సంబంధించిన అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, నూతన ప్రభుత్వ ఆదేశాలతో నిలిపివేశారని అన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం నిధులను విడుదల చేయాలన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాటుపడాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 29 : ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనిఅదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌కు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులపై జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రజావాణిలో మొత్తం 39 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

● ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గుడి తిరుపతిరెడ్డి అనే దివ్యాంగుడు ప్రజావాణికి వచ్చాడు. నడవలేని స్థితిలో ఉండడంతో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అతడికి వద్దకు వెళ్లి సమస్య అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుడినైన తనకు సదరం సర్టిఫికెట్ రావడం లేదని, పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ తిరుపతి రెడ్డికి సదరం సర్టిఫికెట్‌ను అందించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజంతోపాటు ఇతర అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి వాహనాలతోపాటు డ్రైవర్లకు రావాల్సిన డబ్బులను అధికారులు ఇవ్వడం లేదని వాహనాల యజమానులు, డ్రైవర్లు అదనపు కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తమ వాహనాలను డ్రైవర్‌లతో కలిపి వంద రోజులు ఏర్పాటు చేశామన్నారు. కొన్ని డబ్బులను అందించిన వైద్యశాఖ అధికారులు మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డబ్బులను ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెర్ల దేవరాజు, యాగండ్ల మల్లేష్, మాచర్ల శ్రీనివాస్, దివ్యకాంత్, పంతంగి ఎల్లయ్య, ఆర్, కనుకయ్య, దిలీప్‌కుమార్, చందు, పర్శరాం, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్‌పరిధిలోని పెద్దూర్ శివారులో కేటాయించిన డబుల్ బెడ్‌రూంలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి వినతి పత్రాన్ని అందించారు. అశోక్, శ్రీలత, ఉమ, స్వప్న, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ పట్టణ శివారులోని నంది కమాన్ వద్ద ఉన్న చింతల్‌ఠాణా ఆర్అండ్ ఆర్ కాలనీకి సంబంధించిన ప్రధాన దారుల వద్ద స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని స్వాన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పలువురు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. స్వాన్ అసోషియేషన్ సభ్యులు లింగంపల్లి బాబు, నాయిని రవి, చెరిపెల్లి పర్శరాములు, శరణ్‌కుమార్, చిక్కుడి రాజు, చిక్కుడి శివకృష్ణ, దుర్గాని ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

ధర్మపురిలో సంకటహర చతుర్థి పూజలు



స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 29: ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్

గణేశ్‌నగర్, జనవరి 29: విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో గణిత శాస్త్ర విభాగానికి సంబంధించిన విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ రాజేష్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రంలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్ర అధ్యయనం వలన సమాజానికి ఉపయోగకరమైన అంశాలను కనుక్కునే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

1న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జనవరి 29: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలను గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. ఏదైనా కారణం చేత కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోల్ ఎక్కే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి బాలాలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఏమీ లభించకపోవడంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆల యానికి వెళ్లిన భక్తులకు ఇనుప చువ్వలు, పరిసర ప్రాంతాలు చిందరవందరగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణుల బృందం నమూనాలను సేకరించింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ వివరాలు తెలుసుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రెండు ఆలయాల పరిసరాల్లోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు. పలువురు ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, జనవరి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వినోద్ (35)అనే వ్యక్తి బైక్‌పై పెద్దమ్మ మీదుగా సిరిసిల్ల వైపు వెళుతుండగా, గొల్లపల్లి నుంచి గోరంటాల మీదుగా గంభీరావుపేటకు వస్తున్న ప్యాసింజర్ ఆటో మూల మలుపు వద్ద ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వినోద్ మృతి చెందగా, ఆటో డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీస్‌లు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సంద్రంగా వేములవాడ


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


వాహనాలతో నిండిపోయిన గుడి చెరువు పార్కింగ్ స్థలం

● 50 వేలకు పైగా భక్తుల రాక

వేములవాడ, జనవరి 29 : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ప్రతి నిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50 వేల మందికి పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శ్రీ స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భూకబ్జాలపై కరీంనగర్‌లో ఫిర్యాదుల పర్వం

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదుల పర్వం కొనసాగుతున్నది. సోమవారం ఒక్క రోజే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 70 మందికిపైగా బాధితులు పోలీస్‌కమిషనర్‌ను కలిసి వారికి జరిగిన అన్యాయాలను వివరించి, ఫిర్యాదులు చేశారు. వీరందరి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ ఫిర్యాదు తీవ్రతను బట్టి ఆయా ఠాణాలకు, ఏసీపీలకు విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కొందరు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ ఆర్థిక సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఫిర్యాదులు కూడా అధికంగా రావటంతో భూకబ్జాల కేసుల విచారణపై ప్రభావం పడే అవకాశముంది. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఒక్కొక్కటిగా విచారణ చేపడుతున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు గుర్తించి వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినమీదట నిందితులు, వారికి సహకరించిన వివిధ శాఖల ఉద్యోగులు, కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారిస్తున్నారు. నివేదికను తయారు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. సోమవారం కరీంనగర్‌లోని కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ తోపాటు మరో ఇద్దరిని మూడో ఠాణాకు పిలిపించి విచారించి పంపించినట్లు సీఐ వి శ్రీనివాస్ తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన ఒక బాధితుడు తన భూమిని కొందరు కబ్జాచేశారంటూ పోలీస్‌కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో రికార్డులు, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణలో భాగంగా సదరు కార్పొరేటర్, మరో ఇద్దరిని పిలిపించి మాట్లాడి పంపించామని సీఐ తెలిపారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

● మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం

కరీంనగర్ క్రైం, జనవరి 29: మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం చెందిన కొత్తపల్లి మండలం చింతకుంటలోని గురుకుల కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జనుప అక్షిత(17) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా మల్యాల మండలం మైనంపల్లికి చెందిన అక్షిత సాయంత్రం 7 గంటల వరకు తోటి విద్యార్థినిలతోనే కలిసి ఉంది. విద్యార్థినిలు భోజనానికి వెళ్లిన సమయంలో డ్రెస్ మార్చుకుని వస్తానని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్, ఇతర సిబ్బందికి సమాచారం అందించారు. బలవంతంగా తలుపులు తెరచి ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ముందు అక్షిత సూసైడ్ లెటర్ రాసింది. తనకు కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయని బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో తన పేరును ఎక్కించారని, తను 7 గంటలకు డిన్నర్ తరువాత చనిపోతున్నానంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొంది.

కాగా కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చిన 15 మంది విద్యార్థినిల పేర్లను బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో నమోదు చేశారని, ఈ ప్రక్రియ నిత్యం జరిగేదేనని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మార్కులు తక్కువ వచ్చినందుకు అంతకు ముందే అక్షిత కన్నీళ్లపెట్టుకోగా తోటి విద్యార్థులు ఓదార్చినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరి గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

కోనరావుపేట, జనవరి 29: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డి.ఎస్.పి నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన మానక శంకర్ ఓ బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించగా నిజం అని తేలడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 107మంది రైతులు 1,035క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 33క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి29: దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలి విడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్స్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రలలో పరీక్షలు కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమేన్స్ డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వివేకనంద డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, జేఎన్‌టియుహెచ్ ఇంజనీరింగ్ మంథని పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుండి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,289 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 1,303 మందికి 1,282మంది విద్యార్థు లు పరీక్షకు హాజరు కాగా 21మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టిపిసీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి


శిబిరంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ, జనవరి 29: ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ రీజినల్ కమిషనర్ తానయ్య సెల్వట్కార్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు సంయుక్తంగా నిధి ఆప్‌కే నిఖత్ 2.ఓ పేరుతో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈపీఎఫ్ ఖాతాదారులుగా ఉన్న కార్మికులు తమ ఖాతా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసి పరిష్కరించారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వట్కార్ మాట్లాడుతూ ఖాతాలో నిధి ఎంత ఎక్కువ ఉంటే ఖాతాదారులకు అంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, పదవీవిరమణ, పెన్షన్ అవసరాల నిమిత్తం రుణాలు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఖాతాకు ఆధార్ లింకు చేయడం తప్పనిసరి అని, నామినీ పేరు చేర్చితే ఉద్యోగి మరణాంతరం వారి వారసులకు సొమ్ము సులభంగా బదిలీ అవుతుందన్నారు. ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ కార్మికులకు అందిస్తున్న వైద్య సదుపాయం, బీమా సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేస్తూ నెలవారీగా జాప్యం లేకుండా సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఖాతాదారులు తమ అవసరాలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయని, కార్మికులకు ఏ సమస్యలు ఉన్నా ఇందులో పరిష్కరించుకోవాలని సూచించారు.

లింకు కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలి

● రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు

ధర్మారం, జనవరి 29: మండలంలోని నంది రిజర్వాయర్ నుంచి ధర్మారం డీ83/బి ఎస్సారెస్పీ కాలువ లింకు కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నంది రిజర్వాయర్ నుంచి చేపట్టిన లింకు కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ వరకు పనులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన సూచించారు. రిజర్వాయర్ నుంచి ధర్మారంలోని డి83/బి కాలువ వరకు లింకు కాలువ పనులను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సారెస్పీ సీఈ సతీష్‌రాజుచంద్ర, డీఈ కుమార్, ఏఈలు ఉన్నారు.

టెండర్ల ద్వారా అంజన్నకు రూ.3.88 కోట్ల ఆదాయం

మల్యాల, జనవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న పలు దుకాణాలకు అధికారులు సోమవారం కరీంనగర్‌లోని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. వచ్చే ఏప్రిల్ నుంచి మార్చి-2025 వరకు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నిర్వహించిన ఈ టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ. 3,88,41,221 ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ. 2,73,70,271 ఆదాయం సమకూరగా ప్రస్తుతం రూ. 1,14,70,950 ఆదాయం అధికంగా సమకూరింది. గతంలో కొండగట్టు దేవస్థానంలోనే టెండర్లు జరుగగా వ్యాపారుల కుమ్మక్కుతో పలుమార్లు వాయిదా పడుతుండడంతో ఈసారి కరీంనగర్ ఏసీ కార్యాలయంలో నిర్వహించారు. దీంతో అన్నీ ఒకే రోజు ఖరారయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీ స్వామి, ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ అధికారులు ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై సిఫార్సుల కమిటీ ఏర్పాటు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై సిఫార్సుల కమిటీని నియమించినట్లు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో ఆర్‌టీ నంబర్ 4 ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. సభ్యులుగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ చంద్రశేఖర్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, అగ్రికల్చర్, కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, నిజాం షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌లను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో సూచించింది.

షుగర్ ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు

● ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 29: ఏడాది లోపే రాష్ట్రంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినా దంతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన కేవలం హామీలకే పరిమితమైందని ఆరోపించారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తెరిపిస్తామని బీఆర్ఎస్ నాయ కులు హామీ ఇచ్చారన్నారు. ఇదే నినాదంతో ఎంపీగా కవిత విజయం సాధించిన 100 రోజుల్లోనే ప్రైవేటు పరంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ వా టా 51 శాతం తేల్చకుండానే ఉన్న ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేశా రన్నారు. తెలంగాణ ప్రజలపై లక్షల కోట్ల అప్పుల భారం మోపి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలకు మాజీ సీఎం కేసీఆర్ పూర్తిగా నైతిక బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్ ఆరు నెలల్లో సీఎం అవుతారని అంటున్న కేటీఆర్ వాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎలా అవుతారో సమాధానం చెప్పాలన్నారు. పదేళ్ల అనుభవంలో కేటీఆర్ నేర్చుకుంది ఇదేనా అన్నారు. ఈ సమావే శంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు జువ్వాడి కృష్ణారావు, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, దుర్గయ్య ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌కు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలడని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడారు. నిజామా బాద్ ఎంపీ అభ్యర్థిగా కవిత పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు.

ఓవర్‌లోడ్‌పై ఆటోల తనిఖీ


కరీంనగర్‌లో ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో ప్రయాణికుల ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం కొరడా ఝులిపించారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలను తనిఖీ చేసి డ్రైవర్ సీటుకు ఇరుపక్కల ఏర్పాటు చేసిన అదనపు సీట్లను, మ్యూజిక్ సిస్టంలు, ఇతర పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ సీఐ పర్స రమేష్, ఎస్ఐ రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సిరిసిల్ల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సిరిసిల్లకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ గోజిరాయ్ సంస్థలో కరాటే శిక్షణ పొందుతున్న 18 మంది విద్యార్థులు పాల్గొని బంగారు, రజతం పతకాలను సాధించారు. సినీ హీరో సుమన్ చేతులమీదుగా బహుమతులును అందుకున్నారు. పోటీల్లో సైదా షేజా సాదత్, జోనా అనం అదీబా, సాయి జగదీష్, ప్రణవ్, వరుణ్, అఖిల్, సుల్తానా, తన్‌జీలా కౌసర్, అర్మాన్‌ఖాన్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని మాస్టర్ అన్వర్‌ఖాన్, అక్బర్‌ఖాన్, జహీరాబేగం, పహ్మిదా, నల్ల అరుణ అభినందించారు.

సమసమాజ స్థాపన కోసం నారాయణరెడ్డి పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విమలక్క

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: పెత్తందారి వ్యవస్థ నుంచి బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సమసమాజ స్థాపన కోసం కామ్రేడ్ ఇప్ప నారాయణరెడ్డి అనేక పోరాటాలు చేశారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు, కళాకారిణి విమలక్క అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో ఇప్ప వజ్రమ్మ- నారాయణరెడ్డి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అగ్రవర్ణాల అణచివేతపై నారాయణరెడ్డి పేదల పక్షాన ఉద్యమాలు చేశారన్నారు. హక్కుల కోసం ప్రజలను చైతన్యవంతులను చేసి పోరాట దిశగా అడుగులు వేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే, కేడీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన మిత్రుడు నారాయణరెడ్డి పేరిట ఆయన కుటుంబీకులు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ పుస్తకాల కోసం రూ.5 వేల నగదును అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత భాస్కర్, విశ్రాంత డీఈ ఆంజనేయులు గ్రంథాలయానికి పుస్తకాలను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రజిత, వైస్ ఎంపీపీ భాస్కర్, దుమాల ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు విశ్రాంత ఆచార్యుడు శివారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హనుమంతు, నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, శంకర్, శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

చందుర్తి,జనవరి 27: మండలంలోని మల్యాల, మర్రిగడ్డ, తిమ్మాపూర్, అనంతపల్లి, మూడపల్లి, నర్సింగాపూర్, ఆశి రెడ్డిపల్లి, ఎనగల్, జోగాపూర్, చేరువుకుంటపల్లి, చందుర్తి గ్రామాలతోపాటు రుద్రంగిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిగడ్డ, రుద్రంగిలో 33 కేవీ ఫీడర్ మరమ్మతులో భాగంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి

సిరిసిల్ల టౌన్, జనవరి 29 : ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో టీఆర్‌టీఎఫ్ - 2024 డైరీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి పెటిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించడం కోసం ప్రభుత్వం ప్రణాళికలను రూపొందింస్తుందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల ఖాలీల కోసం మెగా డీఎస్సీకి కార్యచరణ సిద్ధం అవుతుందన్నారు. నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తిరిగి కొనసాగించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్, మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, నాయకులు గాజంగి విష్ణు, పెరుక వెంకటేశ్వరావు, బూస చంద్రశేఖర్, వంతడుపుల రాము, గూడెల్లి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, జనవరి 29 : ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహం ఆవిష్కరణను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను మాలమహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ హైదరాబాద్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహం ఆవిష్కరణకు కవులు, కళాకారులు, ఉద్యోగులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు పిట్ల రఘు, కూలేరి చంద్రయ్య, నాందేడ్ అనిల్‌కుమార్, కుకునూరి దేవయ్య, గుడిసె శశి పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల రూరల్, జనవరి 29 : సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ భవనంలో సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వసతిగృహాల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సందర్భంగా సోమవారం ప్రేరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిచారు. డీఈవో రమేష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని నింపేందుకు సైన్స్ ఫేర్‌ను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా ఉపాధికల్పన అధికారి రాఘవేందర్, జిల్లా స్పోర్ట్ అధికారి రాందాస్, మైనార్టీ స్పెషల్ అధికారి సర్వర్‌మియా, విజయలక్ష్మీ, ఎండి అజం, సైకాలజిస్ట్ పున్నంచందర్, వసతి గృహాల అధికారులు రాంచంద్రరెడ్డి, రవీంద్రస్వామి, విజయలక్ష్మీ, కరుణాకర్, శంకర్, భూదేవి, ప్రవీణ్, శ్రీనివాస్, సంతోష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం రద్దు

చందుర్తి, జనవరి 29: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ తిప్పని శ్రీనివాస్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం రద్దయ్యింది. చందుర్తి పీఏసీఎస్ సీఈవో గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ మొత్తం 13మంది సభ్యుల్లో ఒకరు మృతి చెందగా 12మంది ఉన్నారు. చైర్మన్ తిప్పని శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని సభ్యులు తొమ్మిది మంది జిల్లా అధికారికి గత నెల 23న ఫిర్యాదు చేశారు. ఈ నెల 17 అవిశ్వాస తీర్మాన సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని జిల్లా సహకారదికారి బుద్ధనాయుడు నోటీసులు అందించారు. ఈ నెల 17 జిల్లా అధికారి అవిశ్వాస తీర్మానం నిబంధనల ప్రకారం లేదని సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి ఈనెల 29న సభ్యులు అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఉదయం 11 గంటలకు హాజరుకావాలని నోటీసులు అందించారు. అవిశ్వాస తీర్మానం ఫిర్యాదు అందజేసిన డైరెక్టర్లు ఈనెల 27న జిల్లా శాఖ అధికారికి అవిశ్వాసం తీర్మాన ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్లు లేఖను అందజేశారు. దీంతో సోమవారం జరగాల్సిన అవిశ్వాస తీర్మాన సమావేశం రద్దయినట్లు తెలిపారు. చైర్మన్‌గా తిప్పని శ్రీనివాస్ యథావిధిగా కొనసాగనున్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కోనరావుపేట, జనవరి 29 : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 నుంచి 2023 వరకు మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను బృందాలతో సర్వే చేయించి మండల పరిషత్ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కేటీఆర్‌కు మమ్మల్ని టచ్ చేసే దమ్ముందా?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 29 : 'కేటీఆర్‌కు మమ్మల్ని టచ్ చేసే దమ్ముందా. టచ్ చేస్తే వేయి ఓల్టోజీల కరెంటుతో మసి అయిపోతావు' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం కోల్పోయిన తరువాత కేటీఆర్ మతిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ మాటలు వినడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని,తెలంగాణ సెంటిమెంట్‌ను పెట్టుకొని రెండు సార్లు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి వేయి కోట్ల రూపాయాలు దండుకున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన రోజే తెలంగాణ ప్రజలతో పేగుబంధం తెగిపోయిందన్నారు. తండ్రి చాటు బిడ్డగా కేటీఆర్ రాజకీయాలోకి వచ్చారని, ఉద్యమం పేరుతో ఎమ్మెల్యే అయ్యారని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్‌లో ఇద్దరు దళిత, ఇద్దరు బీసీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి కేటీఆర్ దిగజారి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు నెరవేర్చకుంటా 'భరతం పడుతాం.. బట్టలు ఊడదీస్తాం' అనే కేటీఆర్ వ్యాఖ్యలతో దళిత, బీసీ వ్యతిరేకని అర్థం అవుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులను, నాయకులనంటే ఊరుకుబోమన్నారు. తెలంగాణలో 6 లక్షల 71 వేల కోట్ల రూపాయాలు అప్పులు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, నేత కార్మికుల కోసం ఉపాధి కల్పించడం కోసం బతుకమ్మ చీరల, ఆర్‌వీఎం ఆర్డర్లు ఇచ్చి రూ.460 కోట్లు ఎందుకు విడదల చేయలేదని ప్రశ్నించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా మున్సిపల్ కరెంట్ బిల్లులు కట్టలేక పోవడం కేటీఆర్ అసమర్ధత కాదా? అన్నారు. తెలంగాణ సమాజాన్ని అడ్డుపెట్టుకొని వేల కోట్లు దండుకున్నారన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా పొగరుగా మాట్లాడడాన్ని తప్పుపడుతున్నామన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా ఆరు నెలల్లో అధికారం వస్తుందని, సిద్ధంగా ఉన్నామని, పులి వచ్చేస్తుందని అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. జనాల్లోకి పులి వస్తే ఎక్కడికి పోతుందని, బోనులోకెళ్తుందని చమత్కరించారు. 39 మంది ఎమ్మెల్యేలను అడ్డుపెట్టి నేత కార్మికుల కోసం ఉద్యమం చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ కలిసి మొత్తం 65 మంది ఎమ్మెల్యేలం ఉన్నామన్నారు. రాష్ట్ర జౌళిశాఖ మంత్రి తమ్మల నాగేశ్వరావు, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తాము సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. బతుకమ్మ చీరలపై మాట్లాడామని, సొసైటీ సభ్యులు కూడా సమావేశంలో ఉన్నారని అన్నారు. ఓడిపోయిన తరువాత కొత్త నాటకాలను ప్రారంభిస్తే చూస్తూ ఊరుకోబోమని, వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవడం కోసం తాము నిలబడి ఉన్నామని, ఆల్ డిపార్ట్‌మెంట్స్‌కు దుస్తుల ఉత్పత్తికి ఇక్కడ ఆర్డర్లు ఇవ్వడం కోసం త్వరలో ప్రభుత్వం నుంచి జీవో వస్తుందని అన్నారు. మాటల విధ్వంసం ఆపకపోతే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకుండా తీర్పునిస్తారన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరల బిల్లులు ఇవ్వలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. తన స్థాయిని మరిచి కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. అధికారం పోయి కేటీఆర్ అతలాకుతలం అయిపోతున్నారన్నారు. మూడు ఫీట్ల నాలుగు ఈంచులు లేని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి గురించి మాట్లాడుతున్నాడన్నారు. బతుకమ్మ చీరల బకాయిలను ఇవ్వకుండా వస్త్ర వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసి రాజకీయ అవసరాలకు ఉపయోగించుకొని బయట పడింది వాస్తవం కాదా అన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి బిల్లులు ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా మున్సిపల్‌ను అప్పుల్లోకి నెట్టిన చవటదద్దమ్మ ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు మడుపు శ్రీదేవి, యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, పద్మశాల సంఘం అధ్యక్షుడు

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 29 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని, స్నేహసబంధాలు మెరుగు పడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిరిసిల్ల పోలీస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించేందుకు క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే పోలీస్‌లకు క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. మూడు రోజులపాటు ఈ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో భాగంగా ఎంటీఈ గర్ల్స్ జట్టు అలైడ్ వింగ్స్ టీమ్స్ తలపడగా మొదటగా బ్యాటింగ్ చేసిన అలైడ్ వింగ్స్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేయగా ఎంటీ ఈగల్స్ టీమ్ 9.1 ఓవర్లలో 69 పరుగులు చేసింది. 28 పరుగులు చేసి, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి గెలుపులో కీలకంగా వ్యవహరించిన సురేందర్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, అనిల్ కుమార్, శశిధర్ రెడ్డి, కరుణాకర్, కృష్ణకుమార్, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో పతకాలు



కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

వేములవాడ, జనవరి 29 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొక్కిరాల రఘుపతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎస్ఆర్ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వేములవాడకు చెందిన ఎండీ అప్సర్ విజేతగా నిలిచాడని కరాటే శిక్షకుడు ఎంఏ మన్నాన్ తెలిపారు. వివిధ విభాగాలలో సాయి హర్షిత్, మనిరూప్, సూర్య జయచంద్ర, జస్వంత్ బంగారు పతకాలు సాధించగా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పతకాలు అందజేసినట్లు ఆయన వివరించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం

సిరిసిల్ల రూరల్, జనవరి 29: విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరమని, రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ పాఠశాలను ప్రతీ పాఠశాలలో నిర్వహించనున్నామని సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి అన్నారు. పట్టణంలోని మహర్షి పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్‌బోర్డులు, ఎంవీ యాక్ట్, హెల్మెట్, వాహనాల చట్టాలతోపాటు తదితర అంశాలపై ట్రాఫిక్ ఎస్ఐ రాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నియమాల మీదా ట్రాఫిక్ సిగ్నల్స్ మీదా అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సేఫర్ ఇండియన్ రోడ్, ఇండియన్ యూత్ సెక్యూర్ ఆర్గనైజేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి పత్తికొనుగోళ్లు నిలిపివేత

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 29: జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లను నిలిపివేసేందుకు అవకాశముందని, రైతుల వద్ద ఉన్న పత్తి ఈ నెల 31వ తేదీలో విక్రయించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు జిన్నింగ్ మిల్లులలో పత్తిని కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. సీసీఐవారి నాణ్యత ప్రమాణాలకు లోబడి పత్తిరావడం లేదని పత్తిని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కొనుగోలు నిలిపివేయాలని నిర్ణయించారు. రైతుల వద్ద ఉన్న పత్తి ఈ నెల 31లోగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలని సూచించారు.

గొర్రెల కోసం తీసిన డీడీలు ఇప్పించండి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 29: రెండో విడత గొర్రెల కోసం యాదవ కులస్థులు అందించిన డీడీలను తిరిగి ఇప్పించాలని అఖిలభారత యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్‌యాదవ్, భారత యాదవ మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి ఓగ్గు బాలరాజుయాదవ్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ పూజారి గౌతమిని కలిసి డీడీలు తిరిగి ఇప్పించాలని కోరగా సంబంధిత అధికారులతో చర్చించి వారం రోజుల్లోగా డీడీలను తిరిగి అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో యూనిట్‌కు రూ.43 వేల 750 చొప్పున గొర్రెల కాపరులు డీడీలను అందించారన్నారు. గొర్రెల కాపరులు తీసిన డీడీల జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లో వ్యక్తిగత దరఖాస్తు రాసి కలెక్టరేట్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడారి రాములు, పెంజర్ల సత్తయ్య, ముద్దం శ్రీనివాస్, పయ్యావుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు, ధ్వజస్తంభ ఏర్పాటుకు విరాళం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో నిర్మిస్తున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ఏర్పాటుకు మాలేవావ్‌లో స్థిరపడిన గ్రామ వాసి బొమ్మనవేణి పద్మ- శ్రీనివాస్ దంపతులు ముందుకొచ్చారు. రూ.3 లక్షల 36 వేల 116 విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు ముందుగా రూ.1,00,116 నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రెడ్డి, సభ్యులు బాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామాలు



మాట్లాడుతున్న జడ్పీటీసీ గుండం నర్సయ్య

ముస్తాబాద్, జనవరి 29: ముస్తాబాద్ జడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, మాజీ సర్పంచ్ ఏనుగు వేణు, సర్పంచులు బద్ది కళ్యాణిబాను, లకావత్ శ్రీనివాస్, అగ్రారం లక్ష్మణ్, భుక్య దేవేందర్, లక్ష్మీ, జగ్గ నరేష్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అన్నవమనేని సుధాకర్‌రావు, గుండవేని నారాయణరావు, కర్నాల అనిల్, భూక్య గురుబాబు, తోట ధర్మేందర్, మహిపాల్‌యాదవ్, కంచర్ల రాజలింగం, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, జంగ రాజు, ఉపేంద్ర, పార్థివరావుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో కేకే మహేందర్‌రెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జడ్పీటీసీ గుండం నర్సయ్య మాట్లాడారు. కేసీఆర్ అవినీతి పాలన, కేటీఆర్ అహంకా పోకడ, నియంతృత్వ దోరణితో బీఆర్ఎస్‌కు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో వారి బంధువుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో జడ్పీటీసీగా ప్రజలకు న్యాయం చేయలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు చెబుదామంటే కేటీఆర్ అందుబాటులో ఉండేవారు కాదని, అణచివేతకు గురి చేశారని అన్నారు. ఎంతో బాధ ఉంటే పార్టీ నుంచి మారుతున్నామో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. పెత్తనం, అణచివేతను ఓర్వలేకనే రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. మాజీ జడ్పీటీసీ మెర్గు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి తాను శక్తి వంచన లేకుండా కష్టపడ్డానని, ఎన్నో ఆస్తులు నష్టపోయానని అన్నారు. సమైక్యాంధ్రాలో తమను కొనుగోలు చేస్తామన్నా రాష్ట్రం కోసం కష్టపడ్డామన్నారు. కేటీఆర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా బంధుప్రీతి, కుటుంబ పాలన చూపించారన్నారు. పదవులు లేక పోవడం అటుంచితే కనీసం ఆత్మగౌరవం లేకుండా పోయిందన్నారు.

సర్పంచుల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించుకుందామన్న ఒక్కసారి సైతం సమయం కేటాయించలేదన్నారు. సర్పంచుల బిల్లుల కోసం కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒత్తిడితో పనులు చేయించి లక్షల్లో అప్పులు తెచ్చి సర్పంచులు అభివృద్ధి చేసినా బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితి సర్పంచులకు లేకుండా పోయిందన్నారు. పీఏలు సైతం సమస్యలు వినే పరిస్థితిలో లేరన్నారు. వెయ్యి మందితో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరికలు

ముస్తాబాద్ మండలంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఆ పార్టీ నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం స్థానిక ఏఎంఆర్ గార్డెన్‌లో సమావేశం ఉంటుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తోపాటు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో దాదాపు వెయ్యి మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు చెప్పారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 29 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్, విద్యార్థుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలకు గత జూన్ నుంచి డైట్ బిల్లులు రావడం లేదని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 7200 స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ వసతిగృహాలకు నూతన భవనాలను నిర్మించాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మెస్ చార్జీలు పెంచాలని గత ప్రభుత్వం నిర్ణయించందని, దానిని అమలు చేయాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, గుండెల్లి కళ్యాణ్, కుర్ర రాకేష్, నాయకులు వేణు, రాకేష్, కిరణ్, అదిత్య, సంతోష్, అరుణ్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యం



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 29 : సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో పని చేస్తున్న గార్మెంట్ కార్మికులను పరిశ్రమల యాజమాన్యాలు శ్రమదోపిడీకి గురి చేస్తున్నాయని సీఐటీయూ నాయకులు మూషం రమేష్, కోడం రమణ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్ లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లో గోకులదాస్ కంపెనీ ఆధ్వర్యంలో గ్రీన్ నీడిల్ గార్మెంట్ యూనిట్‌ను ప్రారంభించారన్నారు. ఈ గ్రీన్ నీడిల్ గార్మెంట్ యూనిట్‌లో పని చేస్తున్న కార్మికులతో యాజమాన్యం ఓవర్ టైమ్ డ్యూటీలు చేయిస్తూ పని భారం మోపుతోందన్నారు. షిప్‌మెంట్ పేరుతో ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా పనులను చేయిస్తోందన్నారు. కార్మిక చట్టం ప్రకారం ఓవర్‌టైం కట్టిఇవ్వడం లేదని, కార్మికుల పట్ల అనుచితంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కంపెనీలో పని చేస్తున్న కొంత మంది కార్మికులు తమ సీఐటీయూ యూనియన్ దృష్టికి తీసుకొచ్చారని, యూనియన్ నాయకులు గార్మెంట్‌ను సందర్శించి యూనిట్ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. కంపెనీ యాజమాన్యం చేస్తున్న శ్రమదోపిడీని, కార్మిక హక్కులను ప్రశ్నిస్తున్న సీఐటీయూ సంఘం నాయకులపై యూనిట్ యాజమాన్యం పోలీస్‌లకు ఫిర్యాదు చేసి భయపెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. కార్మిక వర్గ సమస్యలపై నిరంతరం పోరాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం పని చేస్తున్న సంఘం సీఐటీయూ అని గార్మెంట్ యూనిట్ యాజమాన్యం కార్మికులకు చేస్తున్న శ్రమదోపిడీపై యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అపెరల్ పార్క్‌లో పని చేస్తున్న గార్మెంట్ కార్మికులకు కార్మిక చట్టాలు వర్తింప జేసే విధంగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆడెపు సంపత్, బెజుగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో కేటీఆర్ అవినీతిపై బీజేపీ పోరాటం

- బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై బుక్‌లెట్

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి



సిరిసిల్లలో మాట్లాడుతున్న గోపి

సిరిసిల్ల రూరల్, జనవరి 29 : సిరిసిల్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అవినీతిపై భారతీయ జనతాపార్టీ పోరాటాలను ప్రారంభిస్తుందని, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై బుక్ లెట్‌ను విడుదల చేసిందని దానిని ముందుగా కేటీఆర్ చదువుకొని మాట్లాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో పదవిని కోల్పోయిన కేటీఆర్ సహనాన్ని కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాజన్న దేవాలయాన్ని నిధులు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఎంపీ బండిసంజయ్‌కుమార్ నిధులను తీసుకరాలేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కరీంనగర్ పార్లమెంటరీ స్థాయిలో జరిగిన అభివృద్ధికి కేంద్రం నిధులపై బుక్ లెట్‌లను విడుదల చేశామని, వాటిని చదువుకోవాలని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అవినీతి పాలన నడిపించడంతోపాటు ముస్తాబాద్ మండలానికి చెందిన ఇద్దరికి అర్హత లేకున్నా ప్రభుత్వ ఉద్యోగాలను ఇప్పించారని ఆరోపించారు. మిడ్‌మానేరు డ్యాం శివారులోని చీర్లవంచ శివారులో ఆక్వాహబ్‌ను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కాంట్రాక్ట్‌ను తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, దానిని బీజేపీ అడ్డుకుంటోందని అన్నారు. సిరిసిల్లను అభివృద్ధి చేశానని ప్రకటించుకోవడం సరికాదని, ఎంత మంది నిరుపేదలకు చెందిన భూములను లాక్కున్నారో గుర్తు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గజభీంకార్ చందు, జిల్లా అధికార ప్రతినిధి ఠాకూర్ రాజుసింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు తుమ్మ విజయ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతలఠాణా నరేష్, తంగళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి సందవేణి రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు చొప్పదండి అంజన్న , చిన్నం నరేష్, శ్రీనివాస్, అంబదాస్, మధు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.